ఇద్దరు ప్రజాప్రతినిధులపై ఎస్సీ,ఎస్టీ, భూక్రమణ కేసు

దుండిగల్, మార్చి 9 : దళితులకు సంబంధించిన భూములను ఆక్రమించడంతోపాటు వారిని కులంపేరుతో దూషించిన ఇద్దరు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజాప్రతినిధులపై బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుతోపాటు భూకబ్జా కేసులు నమోదయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బాచుపల్లి మండలం,నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, నిజాంపేట్‌లోని సర్వేనంబర్ 191లో తులసీ నర్సింహా,అతని కుటుంబసభ్యులు మొత్తం ముగ్గురు వ్యక్తులకు 60 గజాల చొప్పున మొత్తం 180 గజాల ఇంటిస్థలానికి గతంలోనే అప్పటి ప్రభుత్వం ఇండ్లపట్టాలను అందజేసింది. సదరు స్థలంలో చిన్న, చిన్న రూంలు నిర్మించుకుని చుట్టూ కాంపౌండ్‌వాల్ నిర్మించారు. ఈ క్రమంలో ఇటీవల సదరు స్థలంపై కన్నేసిన నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధన్‌రాజు యాదవ్, 8వ డివిజన్ కార్పొరేటర్ సురేశ్‌రెడ్డిలు.. నర్సింహా నిర్మాణాలను తొలగించి రాత్రికి రాత్రే తమ ఆధీనంలోకి తీసుకుని చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేశారు. ఇది ఏమిటని ప్రశ్నించిన నర్సింహాను అతని కుటుంబ సభ్యులను వారు కులం పేరుతో దూషించడంతో పాటు దిక్కున్నచోట చెప్పుకొమ్మని బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో నర్సింహా శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ధన్‌రాజు యాదవ్, సురేశ్‌రెడ్డిలపై భూఆక్రమణతో పాటు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం బాలానగర్‌లోని శ్రీ భ్రమరాంభ సమేత శ్రీ మల్లిఖార్జునస్వామివార్ల దేవస్థానంలో చతుర్థశ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. – మియాపూర్, మార్చి 9

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

వివేకానందగర్ డివిజన్ పరిధిలోని మాధవరం నగర్ కాలనీకి చెందిన చంద్రమౌళి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. మంజూరైన రూ.15 వేల చెక్కును శనివారం ఆయన నివాసంలో కుటుంబ సభ్యులకు అందజేస్తున్న స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ – మియాపూర్, మార్చి 9

వార్షికోత్సవం..

సూరారం డివిజన్‌లోని షాపూర్‌నగర్ క్రియేటివ్ హైస్కూల్ 10వ వార్షికోత్సవాన్ని శనివారం గాజులరామారంలోని మహారాజా గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ షబ్బీర్, ప్రిన్సిపాల్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. – దుండిగల్,మార్చి9

శిల్పారామంలో నృత్యప్రదర్శనలు..

వారాంతపు సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగంగా శనివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలువురు నృత్యకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ప్రదర్శనల్లో భాగంగా తిల్లాన ఆర్ట్స్ గురువులు మాధవి మారెళ్లపూడి శిష్య బృందం భరతనాట్య నృత్య ప్రదర్శనలతో అలరించారు. నృత్యకారులు గంగ, వృందా, సాయి సన్నిధి, అవిజ్ఞా, చేతన, శామృద్ధి, స్మృతి, ఇషితా, అన్వీలు భరతనాట్య నృత్యాలతో అలరించారు. – కొండాపూర్, మార్చి 9

క్రికెట్ పోటీలు..బహుమతులు అందజేత

విజేతలకు మెమొంటోలు అందజేస్తున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

బాలానగర్, మార్చి 9 : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం రాత్రి జాగారాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ ప్రారంభించారు. ఈ క్రికెట్ పోటీల్లో ఫతేనగర్, సనత్‌నగర్ ప్రాంతాల యువకులు పాల్గొన్నారు. సనత్‌నగర్‌టీం సభ్యులు మొదటి బహుమతికి ఎంపికయ్యారు. కార్పొరేటర్ సతీశ్‌గౌడ్ చేతుల మీదుగా మెమొంటోలు అందజేశారు. సాయి నాథ్‌గౌడ్, తేజ, శేఖర్, రవీంద్రనాథ్, రోహిత్, రాకేశ్, వంశీ పాల్గొన్నారు.

మహిళ నుంచి సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్, మార్చి 7 : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్ రాజును శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ సభ్యులు, ప్రజలు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయం వద్ద కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరగా,సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ ..సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని అన్నారు.

కేపీహెచ్‌బీ కాలనీలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

కేపీహెచ్‌బీ కాలనీ 1, 2, 4వ రోడ్లలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను జీహెచ్ ఎంసీ ఎస్‌టీఎఫ్ టీమ్ ఆధ్వర్యంలో కూల్చివేశారు. శనివారం కూకట్‌పల్లి జడ్సీ ఆదేశాల మేరకు కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న మూడు భవనాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మల్లేశ్వర్ మాట్లాడుతూ.. జీహెచ్ ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 9

ట్రస్మా కూకట్‌పల్లి శాఖ అధ్యక్షుడిగా కమలాకర్‌రావు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 9 : తెలంగాణ రాష్ట్ర రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) కూకట్‌పల్లి మండల శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. శనివారం కూకట్‌పల్లిలోని భారత్ వికాస్ పరిషత్ వికలాంగ కేంద్రంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ అధ్యక్షుడిగా జె.కమలాకర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా కె.రవి బాబు, కోశాధికారిగా ఎం.సుబ్రహ్మణ్యంలు ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి మండల పరిధిలో గుర్తింపు పొందిన పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియకు వి.రామకృష్ణారావు, ఇన్నారెడ్డి లు పరిశీలకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, సత్యనారాయణ, సుబ్బారెడ్డి, కమలాకర్, 85 పాఠశాలల కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్ అబ్దుల్ కలాం పార్కులో మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు శనివారం జరిగిన వేడుకలకు అక్యుపెంచర్ థెరపిస్ట్ శశిరేఖ, డెంటిస్ట్ దీప్తి, ఫిజియో థెరపిస్ట్ లక్ష్మీప్రియ, సహీన్ సుల్తాన, శ్రీలక్ష్మి లు హాజరయ్యారు. మహిళలు ఆరోగ్యంగా జీవించాలంటే మితహారం, నిత్యం వ్యాయామం తప్పనిసరిగా ఉండాలన్నారు. మహిళలు సవాళ్లను ఎదుర్కొంటూ ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో విజయం సాధించాలన్నారు. ఈ వేడుకల్లో మహిళలకు ఆటపాటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 9

అలరించిన నృత్యాలు

మాదాపూర్‌లోని అన్నమాచార్య బావనా వాహినిలో పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో శనివారం నృత్య ప్రదర్శన చేపట్టారు. అన్నమాచార్య బావనా వాహిని విద్యార్థులు తొలుత విష్ణు సహస్రనామం, లక్ష్మీ అష్టోత్తరం, శ్రీ నందకాయ, అన్నమ గాయత్రి, తదితర అంశాలతో కూడిన స్వరార్చనలు ఆలపించారు. అనంతరం అక్షద డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ శిష్య బృందం శ్రీ స్వర సిద్ధి వేంకటేశ్వర స్వామివారికి వినాయకకౌతం, స్వాగతం కృష్ణ, పార్వతి వల్లభాష్టకం వంటి సంకీర్తనలు ఆలపించి మెప్పించారు. అనంతరం అన్నమయ్యపురం నిర్వాహకురాలు, పద్మశ్రీ డాక్టర్ శోభరాజు కళాకారులకు జ్ఞాపికలను అందజేసి ప్రసాద వితరణ గావించారు. – మాదాపూర్, మార్చ్ 9

ఘనంగా సోమేశ్వర స్వామికి పూజలు

గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల గ్రామంలో ఉన్న శ్రీసోమేశ్వర స్వామి దేవాలయంలో శనివారం విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ సాయిబాబా, దేవస్థానం చైర్మన్ పురం విజేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాద, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, చెన్నం రాజు, ఆకుల యాదగిరి, గిరి పాల్గొన్నారు. – శేరిలింగంపల్లి, మార్చి 9

ఉచితవైద్య శిబిరం.. మందుల పంపిణీ

జగద్గిరిగుట్ట, మార్చి 9 : పేదలకు ఉపయోగపడేలా ఉచితవైద్యం అందించడం అభినందనీయమని కార్పొరేటర్ విజయశేఖర్ గౌడ్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పంచశీలకాలనీలో శనివారం మల్లారెడ్డిహాస్పటల్ ఆధ్వర్యంలో ఉచితవైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన కార్పొరేటర్.. పేదలు, కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చేయూతనిచ్చేందుకు కార్పొరేట్, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. ఈసందర్భంగా వైద్యనిపుణులు హాజరైనవారికి పరీక్షలు జరిపి మందులు అందించారు. ఆసుపత్రి సిబ్బంది, స్థానికనేతలు పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో మందులు అందజేస్తున్న కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

సురభి కాలనీలో..

శేరిలింగంపల్లి, మార్చి 9: శేరిలింగంపల్లి పరిధిలోని సురభి కాలనీలో కాలనీ యూత్ అసోసియేషన్ కార్యాలయంలో చైల్డ్ ఫండ్ అండ్ సెంటర్ ఫర్ వర్క్డ్ సాలిడారిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ సౌజన్యంతో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ తారక్ రామ్ స్థానికులకు ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ, కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత తరుణంలో ప్రజలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ఫండ్ అండ్ సీడబ్ల్యూసీ స్టేట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీశైలం, ఫీల్డ్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ దివ్య, కమ్యూనిటీ మొబిలైజర్ మమత, షబానా నిర్మల, శ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ నాగరాజు పోతవేణి, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో స్థానికులకు మందులను అందజేస్తున్న డాక్టర్లు

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత

అల్లాపూర్, మార్చి9 : ఆడుకోవడానికి వెళ్లి అదృశ్యమైన బాలుడిని అల్లాపూర్ పోలీసులు వెతికిపట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఇన్స్పెక్టర్ వెంకట్‌రెడ్డి వివరాల ప్రకారం ...అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌కు చెందిన కమల్‌సంగ్ అనే బాలుడు శనివారం ఉదయం 6.30గంటలకు ఆడుకోవడానికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చందిన బాలుడి తండ్రి బనవత్ జియర్ సింగ్ చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు తెలిసిన వాళ్ల ఇండ్లలో వెతినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి.. గాలిస్తుండగా గాయత్రీనగర్ హరిహర ఆలయం ప్రాంగణంలో ఒంటరిగా ఉన్న బాలుడిని గుర్తించి.. స్టేషన్‌కు తీసుకువెళ్లి తల్లిదండ్రులను పిలిపించి అప్పగించారు.

పేకాటస్థావరంపై ఎస్‌వోటీ దాడి.. 8 మంది అరెస్టు

దుండిగల్,మార్చి 9 : పేకాటశిబిరంపై బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు దాడిచేసి..8 మందిని పట్టుకున్నారు. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం...నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్,బాచుపల్లి పరిధిలోని నైనిటాల్ టవర్స్‌లో పేకాటశిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఓటీ పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి సదరు స్థావరంపై దాచేడిచేసి.. పేకాట ఆడుతున్న 8 మందిని పట్టుకున్నారు. వారి నుంచి 8 సెల్‌ఫోన్‌లతో రూ.29,300లను సీజ్‌చేసి బాచుపల్లి పోలీసులకు అప్పగించారు.

కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు

మల్కాజిగిరి పార్లమెంట్ సీనియర్ కాంగ్రెస్ నేత కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డిని కూకట్‌పల్లి యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి జిట్టా సునీల్‌కుమార్ యాదవ్ కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు నాగరాజు, శేఖర్‌గౌడ్, రామ్‌ప్రకాశ్ శర్మ, సుశీల్ యాదవ్, భుజంగరావు తదితరులున్నారు. – కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 9

శివాలయాలల్లో అన్నదాన వితరణ...

శివరాత్రి పర్వదిన వేడుకలను పురస్కరించుకుని శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు శివాలయాలల్లో స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో భక్తులకు ఆలయకమిటీ ప్రతినిధులు అన్నసమారాధన నిర్వహించారు. – దుండిగల్, మార్చి 9

జగద్గిరిగుట్ట మల్లికార్జున,కేతమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమంలో రాష్ట్ర యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి శేఖర్‌యాదవ్ ,తదితరులు

గాజులరామారం డివిజన్, శ్రీరాంనగర్‌లోని భక్తశివమార్కండేయ దేవాలయ ప్రాంగణంలో అన్నదానం

సూరారం కాలనీ కల్యాణ సీతారామాంజనేయ స్వామి ఆలయప్రాంగణంలో జరిగిన అన్నదానంలో భక్తులు

ప్రజలకు అందుబాటులో ఉంటా..

యువజన సంఘాల నేతలతో సమావేశమైన కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

దుండిగల్, మార్చి 9 : అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్‌క్రిష్ణ అన్నారు. ఈ మేరకు నియోజకవర్గం పరిధిలోని ప్రజలు,వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాలు,యువజన సంఘాల ప్రతినిధులు శనివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణను కలిశారు.ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. స్పందించిన కౌన్సిలర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఇతర రంగాలపై అవగాహన పెంచుకోవాలి

ఫుడ్‌ఫెస్ట్‌లో విద్యార్థులతో నిర్వాహకులు, అతిథులు

జగద్గిరిగుట్ట, మార్చి 9 : చదువులో రాణిస్తూ ఇతర రంగాలపై అవగాహన పెంచుకోవాలని విద్యావేత్తలు సూచించారు. రంగారెడ్డినగర్ బ్రైట్‌కాన్సెప్ట్ హైస్కూల్‌లో శనివారం కరస్పాండెంట్ వినోద్‌జాదవ్ ఆధ్వర్యంలో ఫుడ్‌ఫెస్ట్ నిర్వహించగా మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. నార్త్, సౌత్‌ఇండియన్ తోపాటు విదేశీ ఆహారపదార్థాలు ప్రదర్శించి వివరించారు. మెరుగైన ఆరోగ్యంకోసం మంచి పోషకాలున్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కోల వెంకటేశ్, సీహెచ్ నర్సింహులు, శ్యాంప్రసాద్‌రాజు, మధు, స్కూల్ ఇన్‌చార్జి అయేషా పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 9 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శనివారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి.

టమాట కిలో రూ.11, వంకాయ రూ.28, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జి మిర్చి 45, కాకరకాయ 38, బీరకాయ 35, క్యాబేజి 21, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యారెట్ 23, కాలీఫ్లవర్ 18, దొండ 25, చిక్కుడు 50, గోరుచిక్కుడు 28, బీట్‌రూట్ 23, క్యాప్సికం 43, ఆలుగడ్డ 23, కీరా 18, దోసకాయ 18, సొరకాయ 9, పొట్లకాయ (1) 18, కందగడ్డ 65, ఉల్లిపొరక 40, ఉల్లిగడ్డ 22, చింతకాయ 65, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 10, చామగడ్డ 40, ముళ్లంగి (1) 4 నుంచి 6, మొరంగడ్డ 18, గుమ్మడికాయ 23, నిమ్మకాయలు(12) 55 నుంచి 60, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చి బఠానీ 47, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 140, వెల్లుల్లి 200, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

శేరిలింగంపల్లి, మార్చి 9: నాణ్యతా ప్రమాణాల విషయంలో అధికారులు ఎక్కడా రాజీ పడకూడదని, అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి తండాలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తండా వాసులతో మాట్లాడి.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. సీసీ రోడ్డు పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసి రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ప్రజలకు మేలైన మౌలిక వసతుల కల్పనకు పూర్తిగా కట్టుబడి ఉన్నామని అన్నారు. డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీ, బస్తీలో ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని అన్నారు.

గోపన్‌పల్లి తండాలో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా తమ సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గిరిజన మోర్చా అధ్యక్షుడు హనుమంతు నాయక్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, శేఖర్, నర్సింగ్ నాయక్, ప్రభాకర్, ప్రకాశ్, వేణు, కృష్ణ, మహేశ్ నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, గోపన్‌పల్లి తండా వాసులు, స్థానిక నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ విజయవాడ 13వ అదనపు జిల్లా కమ్ సెషన్స్ జడ్జి కోర్టు, విజయవాడ
ఎ.ఎస్.నెం.37/2012
మధ్యన:
వల్లరపు సత్యవతి ... పిటీషనర్
మరియు
గంగరాజు వెంకటకృష్ణారావు ... రెస్పాండెంట్టు, రెస్పాండెంట్/ప్రతివాది
గంగరాజు వెంకట కృష్ణారావు, తండ్రి వెంకటేశ్వరరావు (లేటు), హిందూ, వయస్సు 60 సం.లు, ఫ్లాట్ నెం. 801, 8వ ఫ్లోర్, శాంతినగర్ కాలనీ, దీప్తిశ్రీనగర్ కాలనీ, మియాపూర్, హైదరాబాద్ – 500050.
పై నెంబరు పిటీషనులో వాది ప్రతివాదిపై అస్తి విషయమై పైన తెలిపిన కోర్టునందు పర్మినెంట్ ఇన్‌జంక్షన్ కోరుతూ పిటీషను దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో ప్రతివాది హాజరు నిమిత్తము ది.25-03-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. ప్రతివాది అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల ది.25-03-2024వ తారీఖు ఉదయం 10.30గం.లకు పై తెలిపిన కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరుగారి ద్వారా గానీ హాజరై తమ ఆక్షేపణలను తెలియజేసుకొనవలెను. లేని యెడల శ్రీ కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించబడును.
/// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ///
వాయిదా తేది : 25-03-2024
చండక గణపతి, అడ్వకేట్
డి.నెం.70-11-32, శాంతినగర్, పటమట, విజయవాడ-520010. సెల్: 7702929775